# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 365 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 1-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

అందచందమున్న యారోగ్యమును గాదు
కలిమినున్న మనకు బలిమిగాదు
పుత్తడిగలిగినను సత్తువ గాదండి
సర్వమున్న్న కలుగు సంతసమున

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# ఇరాన్ చేతిలో నయా వెపన్

## అమెరికాకు గుండెపోటు ఖాయం

- యుద్ధరంగ వ్యూహంపై స్పష్టత
- వణుకుపుట్టించే ఆయుధం ఉందన్న నేవీ కమాండర్
- అబ్రహం లింకన్ పనికిరాకుండా చేశామని వెల్లడి
- అమెరికా గుండెల్లో వణుకు పుట్టిస్తామన్న షహ్రామ్ ఇరానీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. శాంతి చర్చలు విఫలమవుతున్న తరుణంలో అమెరికాకు ఇరాన్ నౌకాదళ కమాండర్, రియర్ అడ్మిరల్ షహ్రామ్ ఇరానీ సరికొత్త హెచ్చరిక జారీ చేశారు. శత్రువు వెన్నులో వణుకు పుట్టించే ఒక ఆయుధాన్ని టెహ్రాన్ త్వరలో మోహరిస్తుందని, వారికి (అమెరికా) గుండెపోటు రావాలని ఆశిస్తున్నానని ఆయన తెలిపారు. ఆ ఆయుధం వివరాలను వెల్లడించనప్పటికీ, అది యుద్ధభూమిలో పరిస్థితిని ఏకపక్షంగా మార్చివేస్తుందని పేర్కొన్నారు.

-మిగతా 2 లో



# కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

- ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం
- టిఆర్ఎస్ రాసిపెట్టి ఉందంటూ కవిత పోస్ట్

**హైదరాబాద్,**

'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ,

-మిగతా 2 లో

# వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు

**జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం**

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి
  కార్మికవర్గ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం
- మేడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

విద్యార్థులకు పాఠ్య సామగ్రి సరఫరా విషయంలో సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా జవాబుదారీతనం పెరుగుతుందని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని తెలిపారు. విద్యాశాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోగల విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి

-మిగతా 2 లో





# నేనసలే మంచి వాడిని కాను

- ఇరాను అణు ఒప్పిందానికి రావాల్సిందే
- అప్పటి వరకు శాంతి ఒప్పందం కుదరదు
- మరోమారు హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్,**

దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న ఘర్షణను ముగించాలనే ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించాలంటే తమ షరతులకు ఒప్పకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. అప్పటివరకు ఇరాన్‌పై అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగు తుందని హెచ్చరించారు బుధవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. ఇరాన్ యుద్ధం గురించి మాట్లాడారు. 'బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది.

-మిగతా 2 లో

# బెంగాల్ ఎగ్జిట్ పోల్స్ వెల్లడించం..

యాక్సిస్ మై ఇండియా



2 లో



## బెంగాల్లో విజయం ముమ్మాటికీ

# టిఎంసిదే

- కేంద్రం అధికార దుర్వినియోగం చేసినా ప్రజలు మావెంటే
- వీడియో సందేశం విడుదల చేసిన మమతా బెనర్జీ


**కోల్‌కతా**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 226 కంటే ఎక్కువ సీట్లను టీఎంసీ గెలుస్తుందని స్పష్టం చేశారు. 'మా-మాటి-మానుష్' స్ఫూర్తితో టీఎంసీ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకురావడానికి పశ్చిమ బెంగాల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మమతా బెనర్జీ ఓ వీడియో సందేశం పోస్టు చేశారు.ఎన్నికల ఫలితం ఇప్పటికే తమ పార్టీకి అనుకూలంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని రంగంలోకి దించినా..

-మిగతా 2 లో

# తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం



**హైదరాబాద్ /అమరావతి, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే

-మిగతా 2 లో

# డాలర్ దెబ్బకు రూపాయి ధమాల్

**రూ.95.34 రికార్డు క్షీణత..వడ్డీ రేట్లు పెరగొచ్చు..**

2 లో





# ఆపరేషన్ దేవ్.. ఫెర్టిలిటీ.. హైటెన్షన్!

## తెలంగాణలో గుజరాత్ పోలీసుల సోదాలు

- చిన్నారుల విక్రయాలపై ఆరా
- శిశు విక్రయాల గుట్టు రట్టు
- అక్రమ రవాణా కేసులో పలువురి అరెస్టు
- మురుగన్ గ్యాంగ్‌ను అరెస్టు చేసిన పోలీసులు
- ఆ ముఠా సమాచారంతో పెద్ద ఎత్తున సోదాలు
- దేశ వ్యాప్తంగా నవజాత శిశువుల అక్రమ దందా
- మురుగన్ భార్య కృష్ణవేణి ఆధ్వర్యంలో మరో గ్యాంగ్
- విచారణ స్పీడప్ చేసిన గుజరాత్ పోలీసులు


**హైదరాబాద్,**

'ఆపరేషన్ దేవ్'లో భాగంగా తెలంగాణలో గుజరాత్ పోలీసులు వరుస సోదాలు నిర్వహిస్తుండటం సంచలనం సృష్టిస్తోంది. తాజాగా తెలంగాణ కేంద్రంగా సాగుతున్న భారీ శిశు విక్రయాల ముఠాను గుజరాత్ పోలీసులు రట్టు చేశారు. చిన్నారుల అక్రమ రవాణా చేస్తున్న ఫెర్టిలిటీ సెంటర్లపై గుజరాత్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చిన్నారుల అక్రమ రవాణా కేసులో అరెస్ట్ అయిన మురుగన్ గ్యాంగ్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సోదాలు చేపట్టారు. చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు.

కృష్ణవేణి ఆధ్వర్యంలో మరో ముఠా..

ఈ ముఠా దేశవ్యాప్తంగా నవజాత శిశువులను, చిన్న పిల్లలను అపహరించి అక్రమంగా విక్రయించినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. మురుగన్ గ్యాంగ్ ఒక్క ఏడాదిలోనే 25 మంది చిన్నారుల విక్రయించినట్లు దర్యాప్తులో తేలింది. అలాగే మురుగన్ భార్య కృష్ణవేణి మరో

-మిగతా 2 లో



# కేంద్రం తీరుపై.. సుప్రీం ఆగ్రహం!

## ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ తీవ్ర వ్యాఖ్యలు

- గర్భ విచ్ఛిత్తి కోసం కేంద్రం పిటిషన్
- ఆగ్రహం వ్యక్తంచేసిన ధర్మాసనం
- బాధితురాలు పడిన వేదన ఏదీ భర్తీ చేయలేదంటూ వ్యాఖ్య
- బిడ్డను కనాలా, వద్దా అనేది ఆ మైనర్దే నిర్ణయం
- బాధితురాలు ఎప్పుడైనా అబార్షన్ చేసుకునేలా చట్టం తీసుకురావాలని సూచన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అత్యాచారానికి గురైన 14 ఏళ్ల బాలిక 31 వారాల గర్భాన్ని తొలగించాలంటూ గతంలో ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గురువారం ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, కేంద్రం తరపున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిపై నిప్పులు చెరిగారు. "అత్యాచారం తర్వాత ఆమె (బాధితురాలు) పడిన వేదనను ఏదీ భర్తీ చేయలేదు.

-మిగతా 2 లో

# జర్నలిస్ట్ లకు అక్రిడిటేషన్ కార్డులు

**పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

- 15 రోజుల్లో అర్హులైన వారందరికీ కార్డులు ఇస్తామని హామీ
- నేటి నుంచి అన్ని జిల్లాల్లో కార్డుల పంపిణీ
- జిల్లా కలెక్టర్ లకు ప్రభుత్వం ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జర్నలిస్టులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ మొదలైంది. హైదరాబాద్ హిమాయత్ నగర్ ని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని, ఇందులో ప్రభుత్వానికి రెండో ఆలోచన లేదని చెప్పారు. అక్రిడిటేషన్ కార్డులు జారీ అయ్యాక ఎవరైనా సంస్థ మారితే ఆ సమాచారం అధికారులకు తెలియజేస్తే అలాంటి వారి అక్రిడిటేషన్ కార్డులు తొలగిస్తామన్నారు.

-మిగతా 2 లో



## ఇరాన్ చేతిలో నయా వెపన్

మొదటి తరువాయి

యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ అనేక ప్రతీకార చర్యలు చేపట్టిందని, వాటిలో అమెరికా విమానవాహక నౌక అబ్రహం లింకన్‌ను లక్ష్యంగా చేసుకుని జరిపిన పలు క్షిపణి దాడులు కూడా ఉన్నాయని షహ్రమ్ ఇరానీ తెలిపారు. ఈ దాడులు అమెరికా వైమానిక కార్యకలాపాలకు తాత్కాలికంగా అంతరాయం కలిగించాయని వివరించారు. పశ్చిమాసియా అంతటా అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలపై ఇరాన్ బలగాలు 100కు పైగా విడత దాడులు చేసినట్లు గుర్తు చేశారు. మా కొత్త ఆయుధం అమెరికా గుండెల్లో రైళ్లు పరిగెత్తించడం ఖాయమన్నారు.

## కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

మొదటి తరువాయి

పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణెలి ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

## నేనసలే మంచి వాడిని కాను

మొదటి తరువాయి

వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ స్పష్టం చేశారు . కాగా, శాంతి ఒప్పందానికి అంగీకరించేలా ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది (జా ఎసజీని బిIనిబతీనీనిబ). అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి శాంతి చర్చలు జరగడం లేదు. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను మరోసారి తీవ్రంగా బెదిరించారు. నిలిచిపోయిన అణు కార్యక్రమం చర్చలపై ఇరాన్ త్వరగా తేల్చాలని, తెలివిగా వ్యవహరించాలని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తుపాకితో ఉన్న ఫొటోను పోస్టు చేశారు. దీంతో ఇది నెట్టింట వైరల్ అయింది. యుద్ధం ముగిసిన తరువాతే అణు కార్యక్రమంపై చర్చలని ఇరాన్ తేల్చి చెప్పిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన పోస్ట్‌లో, 'ఇరాన్ తమ పనిని సరిగ్గా చేయ లేకపోతోంది. వారికి అణురహిత ఒప్పందంపై ఎలా సంతకం చేయాలో తెలియదు. వారు త్వరగా తెలివిగా వ్యవహరించాలి!' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో పాటు, ట్రంప్ తన ఎఐ రూపొందించిన చిత్రాన్ని కూడా పంచుకున్నారు, అందులో ఆయన అసాల్ట్ రైఫిల్‌ను పట్టుకొని ఉండగా, వెనుక పర్వత ప్రాంతంలో బాంబులు పేలుతున్నాయి. ఆ చిత్రంపై 'నో మోర్ మిస్టర్ నైస్ గై- (ఇకపై మంచివాడిగా ఉండను!) అని బ్యానర్ ఉంది. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్ని తమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగు తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ బెదిరింపులకు దిగడం గమనార్హం. ఇరాన్ ఓడ రేవులను దిగ్బంధి ంచాలని ట్రంప్ ఆదేశించారని వాల్ స్ట్రీట్ జర్నల్ బుధవారం నివేదించింది. ఈ కథనం ప్రకారం ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశ ఓడరేవులను సుదీర్ఘకాలం పాటు దిగ్బం ధించడానికి సిద్ధం కావాలని ట్రంప్ జాతీయ భద్రతా అధికారులను ఆదేశించారు. ఇరాన్ చిత్తశుద్ధితో చర్చలు జరపడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. ఇరాన్ తన యురేనియం శుద్ధిని 20 ఏళ్ల పాటు నిలిపివేసేలా, ఆ తర్వాత కఠినమైన ఆంక్షలను అంగీకరించేలా బలవంతం చేయాలని ఆయన ఆశిస్తున్నారని ఆ కథనం తెలిపింది. అమెరికా తమ దేశ నౌకలను స్వాధీనం చేసుకోవడాన్ని ఇరాన్ సముద్రపు దొంగతనంగా అభివ ర్ణించింది. ఈ వివాదంపై ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌కు, భద్రతా మండలికి ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవాని అధికారికం గా ఫిర్యాదు చేశారు. అమెరికా చర్యలు అంతర్జాతీయ వాణిజ్యంలో చట్టవిరుద్ధమైనవని ఆయన పేర్కొన్నారు.

## బెంగాల్లో విజయం ముమ్మాటికీ టిఎంసిదే

మొదటి తరువాయి

విజయం మాత్రం టీఎంసీదే అని తేల్చి చెప్పారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ అంచనాలపైనా మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. ఎగ్జిట్ పోల్ గణాంకాలను బీజేపీ కార్యాలయం నుంచే విడుదల చేశారంటూ ఆరోపణలు గుప్పించారు. తమ పార్టీ కార్యకర్తలు, నేతల్లో భయాందోళనలు సృష్టించేందుకు బీజేపీ సంఖ్యలను తారుమారు చేసిందని మండిపడ్డారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో తన మద్దతుదారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. రెండో దశ ఎన్నిక వేళ తన నియోజకవర్గం భవానీపూర్‌లో రాత్రంతా దాడులు జరిగాయని మమతా ఆరోపించారు. ఓట్ల లెక్కింపు నాడు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మమతా కోరారు. రాష్ట్ర ప్రజలంతా ఐక్యంగా ఉండి లెక్కింపును నిశితంగా గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో విజయం టీఎంసీదే అని మరోసారి స్పష్టం చేశారు మమతా బెనర్జీ. కాగా, బుధవారం సాయంత్రం పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిశాయి. దీంతో వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదల అయ్యాయి. అందులో మెజారిటీ పోల్స్.. బీజేపీనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నాయి. దీనిపై మమతా బెనర్జీ స్పందిస్తూ వీడియో సందేశం రిలీజ్ చేశారు.

## ఆపరేషన్ దేవ్.. ఫెర్టిలిటీ.. హైటెన్షన్!

మొదటి తరువాయి

గ్యాంగ్‌ను నడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. లోతైన దర్యాప్తు కోసం హైదరాబాద్‌కు చేరుకున్న గుజరాత్ పోలీసులు ఫెర్టిలిటీ సెంటర్లపై విచారణను ముమ్మరం చేశారు.

## బెంగాల్ ఎగ్జిట్ పోల్స్ వెల్లడించం..

### యాక్సిస్ మై ఇండియా



న్యూఢిల్లీ:
పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తమ సంస్థ ఎగ్జిట్‌పోల్ ఫలితాలను వెల్లడించదని యాక్సిస్ మై ఇండియా వెల్లడించింది. ఈ సంస్థ వ్యవస్థాపకుడు ప్రదీప్ గుప్తా మీడియాతో మాట్లాడారు. డాటా నాణ్యత, ప్రతిస్పందన పంపిణీ, గణాంక విశ్వాస స్థాయిలపై వివరణాత్మక అంతర్గత సమీక్ష నిర్వహించిన తర్వాత ఎగ్జిట్‌పోల్ ఫలితాలను విడుదల చేయరాదని నిర్ణయించామని గుప్తా తెలిపారు.తాము ఎవరికి ఓటు వేశామనే విషయాన్ని చెప్పకుండా మౌనం వహించడానికే ఓటర్లు మొగ్గుచూపారని ఆయన చెప్పారు. 16 క్షేత్రస్థాయి వ్యక్తిగత యూనిట్లతో 80 మంది శిక్షణ పొందిన సర్వేయర్లతో ప్రామాణీకరించిన ఎగ్జిట్‌పోల్స్ విధానాలను అవలంబించి 13,250 మంది పౌరుల నుంచి శాంపిల్స్ సేకరించినట్టు తెలిపారు. అయితే తాము వివరాలు సేకరించడానికి ప్రయత్నించిన 70 శాతం మంది సర్వేలో పాల్గొనడానికి నిరాకరించారని తెలిపారు. వారిలో చాలామంది మౌనంగా ఉండటానికే ఇష్టపడ్డారన్నారు. ఈ క్రమంలో సేకరించిన డాటా విడుదల చేసినా, అది ఓటర్ల వాస్తవిక అభిప్రాయాలను ప్రతిబింబించే అవకాశం లేదని భావించి ఫలితాలను నిలిపివేసినట్టు గుప్తా తెలిపారు.

## వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు

మొదటి తరువాయి

ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం తెలిపారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందనీ, సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగులు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందాలనీ, ఆ వెంటనే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు.

**మండల స్థాయిలో నోడల్ అధికారిని నియమించాలి**

విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువుల సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలనీ, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలని అన్నారు. అదే విధంగా ప్రతి విద్యార్థికి అవసరమైన సామగ్రి అందిందా లేదా చెక్ చేసుకోవాలని ఆయన ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, టీజీబీసీడబ్ల్యూఆర్ఐఈఎస్ కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

మొదటి తరువాయి

అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది.ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, విశాఖ, విజయవాడ, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణలో వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం మాత్రం అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఏపీలోనూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

## డాలర్ దెబ్బకు రూపాయి ఢమాల్

**రూ.95.34 రికార్డు క్షీణత..వడ్డీ రేట్లు పెరగొచ్చు..**

ముంబయి
: అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రికార్ కనిష్టాన్ని చవి చూసింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం, దేశీయ స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు వెల్లువెత్తడం, ఫారెక్స్ రిజర్వులపై ఒత్తిడి, ద్రవ్య లోటు పెరగడం తదితర పరిణామాలతో రూపాయి విలువ అగాథంలోకి పడిపోయింది. గురువారం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 95.01 వద్ద ప్రారంభమైంది. ఓ దశలో కొంత పుంజుకుని 95.25 వద్ద నమోదయ్యింది. తుదకు 0.51 శాతం లేదా 46 పైసలు క్షీణించి 95.34 వద్ద ముగిసింది. ఇంతక్రితం మార్చి 30న 95.24 ఆల్‌టైం



కనిష్టాన్ని తాకింది. ఆ తర్వాత మరింత పడిపోవడం ఇదే తొలిసారి. బుధవారం సెషన్‌లో 84.85 వద్ద నమోదయ్యింది.

**ద్రవ్యోల్బణ ఒత్తిడి..**

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పులు చేయకపోవడం, పెరిగిన చమురు ధరల వల్ల ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరగడం భారత కరెన్సీపై ప్రభావాన్ని చూపింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడం, విదేశీ నిధులు బయటకు వెళ్లిపోతుండటంతో రూపాయిపై తీవ్ర ఒత్తిడి కొనసాగుతోంది. రూపాయికి మద్దతును ఇవ్వడానికి గత నెల చివరిలో, ఈ నెల ప్రారంభంలో కేంద్ర బ్యాంక్ చేపట్టిన కరెన్సీ మద్దతు చర్యల వల్ల వచ్చిన లాభాలు హరించుకుపోయాయి. ఈ నేపథ్యంలో ఆర్బీఐ మరిన్ని కొత్త చర్యలు తీసుకోకపోతే గడ్డుకాలమే నని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రూపాయిపై ఒత్తిడి ఇలాగే కొనసాగితే, స్పాట్ కరెన్సీ మార్కెట్‌లో చమురు సంబంధిత డాలర్ డిమాండ్‌ను నియంత్రించడం, బంగారం దిగుమతులను తగ్గించడం, కరెన్సీకి మద్దతుగా ద్రవ్య విధానాన్ని కఠినతరం చేయడం వంటి చర్యలను రిజర్వ్ బ్యాంక్ పరిశీలించవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

## జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

మొదటి తరువాయి

15 రోజుల్లో అందరికీ..
దేశంలో అత్యుత్తమ విధానాలతో అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఇంతకాలం ఆలస్యం జరిగిందని మంత్రి చెప్పారు. సుమారు 4546 వేల మంది అర్హత కలిగి ఉండాలి తమ ప్రభుత్వం ఇచ్చిన జీవోలు ఉండేవని ఇదే గత ప్రభుత్వంలో 32 వేల మంది నుంచి 35 వేల మంది మాత్రమే ఉండేవన్నారు. గతంలో పొడిగించిన అక్రిడిటేషన్ల గడువు ఇవాళ్టితో ముగిసిందని కొత్త కార్డులు ఇస్తామన్నారు. ఇప్పటికే స్టేట్ కార్డుల్లో 2500 మందికి క్లియర్ చేశామని జిల్లా స్థాయిలో అర్హత కలిగిన జర్నలిస్టులకు కార్డులు ఇచ్చేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. 15 రోజుల్లో అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. కొత్త దరఖాస్తులకు డెడ్ లైన్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దాంతో కొత్తగా ఎన్ని కార్డులు మంజూరు చేశామో సంఖ్య తెలిస్తే దాని ఆధారంగా జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అమలు చేసే విషయంలో ప్రభుత్వం సానుకూల ఆలోచన చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

**నేటి నుంచి జిల్లాల్లో పంపిణీ**

తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. మే 1 నుంచి 10లోపు అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పష్టం చేసింది. 2022-2024 సంవత్సరాలకు గాను గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో జర్నలిస్టులకు ఇబ్బంది కలగకుండా కొత్త కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కలెక్టర్లకు కీలక ఆదేశాలు..**

సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు, స్పెషల్ కమిషనర్ జి.ముకుంద రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి జిల్లాలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశాలను నేటి లోగా పూర్తి చేయాలని తెలిపారు. ఆయా అక్రిడిటేషన్ కమిటీల ఆమోదం పొందిన అర్హులైన జర్నలిస్టులకు మే 1 నుంచి మే 10లోపు అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదికను పంపాలని కలెక్టర్లకు సమాచారం అందించారు. ఈ మేరకు జిల్లా పౌర సంబంధాల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది జర్నలిస్టులకు లబ్ధి చేకూరనుంది.


## కేంద్రం తీరుపై.. సుప్రీం ఆగ్రహం!

మొదటి తరువాయి

మేడమ్, ముందు పౌరులను గౌరవించడం నేర్చుకోండి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

-తుది నిర్ణయం బాధితురాలికే..

కాగా, అత్యాచార బాధితులు గర్భం దాల్చినప్పుడు.. ఏ సమయంలోనైనా అబార్షన్ చేసుకునేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రానికి సూచించింది. 14 ఏళ్ల బాలికకు సంబంధించి 30 వారాల గర్భవిచ్ఛిత్తికి ఇటీవల సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయంపై ఎయిమ్స్ వైద్యులు సుప్రీంకోర్టులో 'క్యురేటివ్ పిటిషన్' దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. గర్భం దాల్చిన ఈ దశలో (30 వారాలు) గర్భవిచ్ఛిత్తి చేస్తే.. భవిష్యత్తులో బాలిక ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఎయిమ్స్ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. కోర్టు స్పందిస్తూ.. వైద్యుల సూచనల నేపథ్యంలో.. తుది నిర్ణయాన్ని



బాధితురాలు, ఆమె తల్లిదండ్రులకే వదిలేస్తున్నట్లు స్పష్టం చేసింది.

-ప్రభుత్వానికి హక్కు లేదని..

ఈ సమయంలోనే అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను వ్యతిరేకించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కోర్టు ఇచ్చిన తీర్పును బాధితురాలు లేదా ఆమె కుటుంబ సభ్యులు మాత్రమే సవాలు చేయగలరని, ఈ విషయంలో ప్రభుత్వానికి ఆ హక్కు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ దశలో గర్భవిచ్ఛిత్తి సాధ్యం కాదని, బిడ్డకు జన్మనిచ్చి దత్తతకు ఇవ్వడమే ఏకైక మార్గమని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఈ వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఇదే ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చి జోక్యం చేసుకుంటూ, "మేము వ్యక్తిగత ఎంపికలను గౌరవిస్తాము, మీరు కూడా అలాగే గౌరవించాలి" అని ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేస్తూ, బాధితురాలి హక్కులకే అత్యున్నత న్యాయస్థానం పీఠం వేసింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి కీలక సూచనలు చేసింది. అత్యాచార బాధితులు గర్భం దాల్చినప్పుడు.. ఏ సమయంలోనైనా దానిని తొలగించుకునేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రానికి సూచించింది.

# మే డే- కార్మికుల చెమటకు గౌరవం

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే 1న జరుపుకునే మే డే కేవలం సెలవు రోజు కాదు, శ్రమజీవుల పోరాటాలకు, వారి హక్కులకు గౌరవం తెలిపే రోజు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినం కోసం కార్మికులు చేసిన ఉద్యమానికి గుర్తుగా ఈ దినోత్సవం ప్రారంభమైంది. భారతదేశంలో 1923లో చెన్నైలో మొదటిసారిగా మే డే నిర్వహించారు.దేశ అభివృద్ధిలో రైతు ఎంత ముఖ్యమో కార్మికుడు కూడా అంతే ముఖ్యుడు. రోడ్లు, భవనాలు, పరిశ్రమలు, రవాణా, విద్యుత్, నిర్మాణ రంగం వంటి ప్రతి రంగం వెనుక కార్మికుల చెమట ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే వెన్నెముక. అయితే ఇప్పటికీ అనేక మంది కార్మికులు తక్కువ జీతాలు, ఎక్కువ పని గంటలు, భద్రత లేని పనిస్థలాలు, కాంట్రాక్ట్ ఉద్యోగాల్లో అస్థిరత, పి.ఎఫ్., ఈఎస్ఐ వంటి సౌకర్యాలు లేకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. మహిళా కార్మికులపై వివక్ష, బాల కార్మిక వ్యవస్థ, వలస కార్మికుల ఇబ్బందులు ఇంకా కొనసాగుతున్నాయి. శ్రమ దోపిడీ అంటే కార్మికుడి శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వకుండా వాడుకోవడం. కనీస వేతనం చెల్లించకపోవడం, సెలవులు ఇవ్వకపోవడం, అప్పుల పేరుతో బానిసలా పని చేయించడం వంటి ఘటనలు దీనికి ఉదాహరణలు. తెలంగాణలో పరిశ్రమలు అధికంగా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్ ప్రాంతాల్లో లక్షలాది మంది కార్మికులు పని




చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు, రోజువారీ కూలీలు నిరుద్యోగం, తక్కువ కూలి, సీజనల్ పనితో ఇబ్బందులు పడుతున్నారు. భారతదేశంలో ఎక్కువ మంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. కరోనా సమయంలో వలస కార్మికుల కష్టాలు దేశం మొత్తం చూసింది. ఉద్యోగాలు కోల్పోయి వందల కిలోమీటర్లు నడిచి స్వగ్రామాలకు వెళ్లిన ఘటనలు కార్మికుల అసలైన పరిస్థితిని తెలియజేశాయి.ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రకటిస్తున్నాయి. వేతనాల పెంపు, భద్రతా చర్యలు, సామాజిక భద్రతా పథకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఉపాధి పథకాలు, గిగ్ వర్కర్లకు సోషల్ సెక్యూరిటీ, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. కొత్త లేబర్ కోడ్స్ ద్వారా కనీస వేతన వ్యవస్థ బలోపేతం, పి.ఎఫ్., ఈఎస్ఐ సౌకర్యాల విస్తరణ, గిగ్ వర్కర్ల రక్షణ, పని ప్రదేశ భద్రత మెరుగుదల వంటి ప్రయోజనాలు లభిస్తున్నాయి. అయితే ఉద్యోగ భద్రత తగ్గవచ్చని, సమ్మెలపై పరిమితులు పెరిగాయని కొన్ని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.మే డే నాడు కార్మిక సంఘాలు వేతనాలు పెంచాలని, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆందోళనలు నిర్వహిస్తాయి. ఇది కార్మికుల పోరాటాల స్ఫూర్తిని గుర్తుచేసే రోజు.కార్మికుడి చెమటే దేశ సంపద -- శ్రమజీవి బలమే దేశ బలం
కార్మిక సంక్షేమమే దేశ ప్రగతికి బాట

**వేల్పుల మహేందర్**
**9912775834**



# బీఆర్ఎస్ బిఎల్ఏలకు అవగాహన సదస్సు



**పెద్దపల్లి, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టబోయే ఎస్ఐఆర్ కార్యక్రమంపై పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బూత్ లెవల్ ఏజెంట్లుకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ఖచ్చితత్వాన్ని పెంపొందించడంలో ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు. డూప్లికేట్ లేదా అనర్హుల పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు, యువ ఓటర్ల వివరాల సేకరణలో బిఎల్ఏలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.శిక్షణలో ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 వినియోగ విధానం, క్లెయిమ్స్--అభ్యంతరాల దాఖలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని, వలస వెళ్లిన వారి వివరాలను నవీకరించాలని సూచించారు.రాబోయే ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు ఈ శిబిరం ద్వారా అందించబడ్డాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు, మాజీ మండల అధ్యక్షులు, పార్టీ మండల నాయకులు, పట్టణ నాయకులు, సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో బిఎల్ఏలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పదోవ తరగతి విద్యార్థుల ఘన విజయాలు

**కరీంనగర్/హుస్నాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు విశేష ప్రతిభ కనబరుస్తూ సంబరాలు జరుపుకుంటున్నాయి. చిగురుమామిడి మండలం ఇందుర్తి జడ్పీహెచ్ఎస్ 100 శాతం ఉత్తీర్ణత సాధించి మరోసారి ప్రభుత్వ విద్య ప్రతిష్టను నిలబెట్టింది. మండల స్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన షేక్ మెహబీ, ఎండి అస్రా సుల్తానాలను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు శాలువాలు కప్పి సన్మానం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులు నిరూపించారని మంత్రి పేర్కొన్నారు.పాలకుర్తి మండలం జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులతో మండలంలో రెండవ స్థానంలో నిలిచారు. 60 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై అందరూ




ఉత్తీర్ణులయ్యారు. డి. అనూహ్య 559, కె. సాయిచరిత 525, కె. హర్షిత 522, కె. అక్షయ 514, మేఘన 512 మార్కులు సాధించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకున్నారు. గ్రామాల్లో స్వీట్లు పంపిణీ చేసి, టపాకాయలు పేల్చి ఆనందం పంచుకున్నారు.కరీంనగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ హై స్కూల్ విద్యార్థులు కూడా విశేష ఫలితాలు సాధించారు. 44 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 100% ఉత్తీర్ణత సాధించగా, 16 మంది 500 పైగా మార్కులు సాధించారు. ఉమ్మారెడ్డి నిశ్విత 570 మార్కులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ విజయానికి కారణమైన ఆచార్యులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభతో పాటు ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఉన్నత విద్యా అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో పరిశోధన, పిహెచ్డీ పట్టాలు



**కరీంనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో మేధా కలయిక--క్రియాశీలక విజ్ఞానం శీర్షికతో పరిశోధన పరిచయం కార్యక్రమం జరిగింది. కొత్తగా చేరిన పరిశోధక విద్యార్థులు, మార్గదర్శకులకు పరిశోధన ప్రమాణాలు, పద్ధతులు, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. డా. డి. హరికాంత్, డా. మల్లారెడ్డి, డా. హరిజౌత్, డా. బి. నరేష్, డా. కె. అర్జున్, డా. ఏ. సతీష్‌కుమార్ పరిశోధన విధానాలు, అకడమిక్ అభివృద్ధిపై మార్గనిర్దేశం చేశారు. ఉర్దూ విభాగంలో పరిశోధక విద్యార్థిని ఫర్హాత్ అంజుమ్ ఉర్దూ నవలలు, కథానికలలో జంతువుల ప్రతీకలు, రూపకాలు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందింది. ఆమె పరిశోధనకు డా. హుమేరా తస్లీమ్ పర్యవేక్షణ వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సతీష్‌కుమార్, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.కామర్స్ విభాగంలో స్మిత మహీంద్రాకర్ వర్కింగ్ ఆఫ్ యూపీఐ సిస్టం ఇన్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్డీ పట్టా పొందింది. డా. డి. హరికాంత్ పర్యవేక్షణలో జరిగిన ఈ పరిశోధన సమాజానికి ఉపయోగపడే అంశమని ఆయన అభినందించారు.ఈ విజయాలు శాతవాహన విశ్వవిద్యాలయం పరిశోధనాభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపుకు దోహదం చేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.


# కేంద్రీయ విద్యాలయం స్థల కేటాయింపుపై డిమాండ్

**జగిత్యాల, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో కేంద్రీయ విద్యాలయం స్థల కేటాయింపుపై ఆలస్యం జరుగుతుండటం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమని బీజేపీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ బోగ శ్రావణి విమర్శించారు. జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి, తక్షణమే స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసిందని, కోరుట్లలో నవోదయ విద్యాలయం ఇప్పటికే ప్రారంభమైందని గుర్తు చేశారు. కానీ జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో 10 ఎకరాల స్థలం కేటాయింపులో స్థానిక ప్రజాప్రతినిధులు తాత్సారం



చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. నిజామాబాద్, వనపర్తి జిల్లాల్లో స్థల కేటాయింపు జరిగిందని, జగిత్యాలలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు.మే 15లోపు స్థలం కేటాయింపు జరగకపోతే, అదే రోజు జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అరవింద్ ధర్మపురి నిరాహార దీక్ష చేపడతారని శ్రావణి ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్, ప్రాంత అభివృద్ధి కోసం కేంద్రీయ విద్యాలయం తప్పనిసరిగా అవసరమని, ఈ విషయంలో జిల్లా మంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, వార్డ్ కౌన్సిలర్ మిమ్మల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యునికి ఘన సన్మానం



**కరీంనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణానికి పర్యటనకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె. లక్ష్మణ్‌ను బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి పోతుగంటి సుజాత రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలు గల ధాన్యమే కొనుగోలు

**వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్**

**ఆమనగల్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల వ్యవసాయ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్ గురువారం ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ప్రస్తుతం యార్డుకు 400 క్వింటాళ్ల వరి చేరగా, 100 క్వింటాళ్లు కాంటా వేయడం జరిగింది. వ్యవసాయ శాఖ సిబ్బంది ఉదయం, సాయంత్రం తేమశాతం, నాణ్యతా ప్రమాణాలను



పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ, "రైతులు తమ పొలంలోనే ధాన్యాన్ని ఆరబెట్టి, తూర్పార పట్టి యార్డుకు తీసుకురావాలి. 17% తేమశాతం, తాలు--రాళ్లు లేకుండా ఉంటే క్వింటాల్‌కు రూ.2389/- ఏ గ్రేడ్ ధర లభిస్తుంది. సన్న రకానికి అదనంగా క్వింటాల్‌కు రూ.500/- ప్రోత్సాహకం లభిస్తుంది" అని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సొసైటీ సీఈఓ పద్మాకర్, సిబ్బంది దేవేందర్, మహేష్, ఏఈఓలు నికిత, మీనాక్షి పాల్గొన్నారు.

## చిగురుమామిడి పెద్ద చెరువు సుందరీకరణను తక్షణమే చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్



**హుస్నాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో రాష్ట్రంలో తొలి గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం అభినందనీయమైన అభివృద్ధి కార్యక్రమంగా ప్రజలు స్వాగతిస్తున్నప్పటికీ, అదే సమయంలో చిగురుమామిడి గ్రామంలోని పెద్ద చెరువు దయనీయ స్థితి స్థానికులను ఆవేదనకు గురిచేస్తోంది.బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు చెరువులోకి వెళ్లేందుకు కనీస సౌకర్యాలైన మెట్లు కూడా లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆకర్షణీయ ప్రాజెక్టులకు భారీ నిధులు కేటాయించడం కంటే ప్రజలకు నేరుగా ఉపయోగపడే ప్రాథమిక వసతులపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.ఎల్లమ్మ చెరువు సుందరీకరణకు వెచ్చిస్తున్న నిధుల్లో కొంత భాగమైనా చిగురుమామిడి పెద్ద చెరువు అభివృద్ధికి కేటాయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండలంపై కొనసాగుతున్న చిన్నచూపు ఇకనైనా మారాలని, స్థానిక కాంగ్రెస్ నాయకులు వెంటనే స్పందించి పెద్ద చెరువు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.ప్రచారం కోసం గ్లాస్ బ్రిడ్జిలు కాదు, ప్రజల అవసరాలకు పెద్దపీట వేయాలని, చిగురుమామిడి పెద్ద చెరువు సుందరీకరణను తక్షణమే చేపట్టాలని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు.

## మే 1వ తేదీన కొండగట్టు 40వ గిరిప్రదక్షిణ ప్రారంభం




**కరీంనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పూజ్య గురువులు సురేష్ ఆత్మారామ్ మహరాజ్ ఆధ్వర్యంలో మే 1వ తేదీ శుక్రవారం ఉదయం 5.30 గంటలకు కొండగట్టు 40వ గిరిప్రదక్షిణ ప్రారంభం కానుంది.రాష్ట్ర నలుమూలల నుండి దాదాపు ఇరవై వేల మంది భక్తులు ఈ గిరిప్రదక్షిణలో పాల్గొననున్నారు. తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, మంచినీరు, అరటిపండ్లు పంపిణీ చేయనున్నారు.తెలంగాణలోని ప్రముఖ హనుమాన్ దేవాలయం పరిధిలో జరిగే ఈ గిరిప్రదక్షిణలో సుమారు ఎనిమిది వందల మంది శ్రీనివాస మిత్రులు పాల్గొంటున్నారని సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఫుట్నూరి తెలిపారు.భక్తుల ఉత్సాహం, సేవా కార్యక్రమాలతో కొండగట్టు గిరిప్రదక్షిణ ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరగనుంది.


## ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ కార్యక్రమం




**కరీంనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం విశేష సేవలందించిన ఏడుగురు పోలీసు అధికారులు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా గురువారం కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది.వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై సత్యనారాయణ, సిఎస్బి ఎస్సై శ్రీనివాస్, ఏఆర్ విభాగం సర్దార్ భగవాన్ సింగ్, మానకొండూరు పోలీస్ స్టేషన్ ఏఎస్సై ఖాజా జమాలుద్దీన్, ఏఆర్ ఎస్సై లక్షయ్య, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్సై వెంకటరమణ, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి పదవీ విరమణ పొందారు.అడిషనల్ డీసీపీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, అధికారులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం గొప్ప విజయమని అభినందించారు. కుటుంబ సభ్యుల సహకారం వల్లే అధికారులు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఆర్ ఎస్సై తిరుపతి, ఇతర అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మే డే - కార్మికుల హక్కుల పోరాటానికి ప్రతీక

ప్రపంచ కార్మిక దినోత్సవంగా ప్రతి సంవత్సరం మే 1న జరుపుకునే మే డే, కార్మికుల కష్టం, త్యాగం, హక్కుల సాధనకు ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక రోజు. పరిశ్రమలు, వ్యవసాయం, రవాణా, నిర్మాణ రంగం ఇలా ప్రతి రంగం అభివృద్ధి వెనుక కార్మికుల శ్రమ దాగి ఉంది.1886లో అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పని విధానం కోసం కార్మికులు చేపట్టిన మహా ఉద్యమం మే డే ఆవిర్భావానికి పునాది వేసింది. ఆ పోరాటంలో అనేక మంది కార్మికులు ప్రాణత్యాగం చేశారు. వారి త్యాగాలకు గౌరవంగా ప్రపంచవ్యాప్తంగా మే 1ను కార్మిక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.
ాభారతదేశంలో కూడా మే డే కార్మిక ఉద్యమాలకు ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంది. కనీస వేతనం, పని గంటలు, భద్రత, సంక్షేమం వంటి అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ రోజు ఉపయోగపడుతుంది. కార్మికుల సంక్షేమమే దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది.నేటి ఆధునిక




యుగంలో అసంఘటిత రంగ కార్మికులు, వలస కార్మికులు ఇంకా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి సామాజిక భద్రత, సరైన వేతనాలు, ఆరోగ్య రక్షణ కల్పించడం ప్రభుత్వాలు, సమాజం బాధ్యత.మే డే కేవలం ఒక వేడుక కాదు, కార్మికుల గౌరవాన్ని గుర్తుచేసే రోజు. వారి కష్టానికి తగిన గౌరవం, హక్కులకు రక్షణ, జీవితానికి భరోసా కల్పించాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటించే సందర్భం.కార్మికుడే దేశాభివృద్ధికి వెన్నెముక -- శ్రమకు గౌరవం ఇవ్వడం సమాజ బాధ్యత.

**కాశవేణి రాకేష్**
**హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి**
**నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక**



# అభివృద్ధికై సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలి

### -మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలంలోని ఉమ్మాపూర్ గ్రామంలో నిర్మించనున్న శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల స్థలాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల పత్రాలను ఉపకులపతి ఆచార్య ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సతీష్‌కుమార్‌కు అధికారికంగా అందజేశారు. మంత్రి మాట్లాడుతూ కళాశాల భవన నిర్మాణాలు త్వరలో ప్రారంభమవుతాయని, ఆధునిక హాస్టల్ భవనాలు, సమగ్ర మౌలిక వసతులతో కళాశాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్య అందుబాటులోకి రావడం ద్వారా వారి భవిష్యత్తు బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఉపకులపతి ఉమేశ్‌కుమార్ పరిశ్రమలతో ఎంఓయూలు కుదుర్చుకొని విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.చిగురుమామిడి మండలంలో కాంగ్రెస్



కార్యకర్తల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ రైతు సంక్షేమం, విద్య, తాగునీరు, ఆరోగ్యం, గ్రామాభివృద్ధి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కోసం ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం పాత బావుల పూడికతీత, పైప్‌లైన్ విస్తరణ, కొత్త బోర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యా రంగంలో బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని పిలుపునిచ్చారు. వనమహోత్సవం ద్వారా ప్రతి గ్రామంలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆరోగ్య రంగంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కోహెడ మండలంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ రైతు సంక్షేమం, తాగునీరు, విద్య, ఆరోగ్యం, పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆఫ్‌లైన్ విధానం కొనసాగుతోందని, రైతులకు ఇబ్బందులు రాకుండా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలని, వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని సూచించారు. ఆరోగ్య రంగంలో ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, ఓటరు జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. హుస్నాబాద్, చిగురుమామిడి, కోహెడ మండలాల్లో అభివృద్ధి, సంక్షేమం, విద్య, ఆరోగ్యం, పర్యావరణం రంగాల్లో సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## చట్టబద్ధ దత్తత,బాలల రక్షణపై అవగాహన సదస్సు


**సిద్దిపేట, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత, రక్షణ, మాదకద్రవ్యాల వ్యతిరేక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో గురువారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో చట్టబద్ధ దత్తత, ఫోస్టర్ కేర్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దత్తత కోసం దరఖాస్తు చేసిన దంపతులు, ఇప్పటికే చట్టబద్ధంగా దత్తత తీసుకున్న తల్లిదండ్రులు పాల్గొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి శారద చేతుల మీదుగా తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దత్తత తల్లిదండ్రులకు ప్రభుత్వ ఉత్తర్వులు అందజేశారు.వేర్ ఆర్ ఇండియా చిల్డ్రన్ సంస్థ డైరెక్టర్ మీరా మారుతి రిసోర్స్ పర్సన్‌గా హాజరై, దత్తత కేవలం సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్




అథారిటీ లేదా ప్రత్యేక దత్తత సంస్థ ద్వారా మాత్రమే చట్టబద్ధమని, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, బంధువులు లేదా ఇతరుల ద్వారా పిల్లలను తీసుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. పిల్లలను అసురక్షిత ప్రదేశాల్లో వదిలివేయకుండా, పోషించలేని పరిస్థితుల్లో ఊయల కేంద్రాలను వినియోగించాలని సూచించారు.దత్తత అనంతరం పిల్లల సంరక్షణ, చట్టపరమైన విధానాలు, ఫోస్టర్ కేర్ వంటి అంశాలపై అధికారులు వివరణ ఇచ్చారు. తల్లిదండ్రుల సందేహాలకు సమగ్ర సమాధానాలు అందించారు. అనంతరం దత్తతకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, చైల్డ్ లైన్ ప్రతినిధులు, దత్తత తల్లిదండ్రులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## 11 కేవి విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

**దేవరకొండ ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
గుడిపల్లి మండలం రాయిని పాలెం గ్రామ శివారులో వ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలన గురువారం ఒక తీవ్ర ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామ శివారులో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు లూజ్‌గా కిందికి వేలాడుతూ ఉండడంతో, గడ్డి కట్టలతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీకి తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్ ట్రాలీ పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ తీగలు చాలా కాలంగా ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయని, ఈ విషయాన్ని పలుమార్లు



విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని వారు తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఘటనలో ట్రాక్టర్ ట్రాలీతో పాటు దాదాపు 200 గడ్డి కట్టలు పూర్తిగా కాలిపోయాయి. రైతుకు భారీ నష్టం వాటిల్లడంతో ఆయన తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించినా, ఇది చాలా ఘోరమైన ప్రమాదమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధితులు స్పందిస్తూ, విద్యుత్ శాఖ అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, తమకు జరిగిన నష్టానికి ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిచే ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ



**కరీంనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సనా జవేరియాతో కలిసి సప్తగిరి కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం మరియు పద్మనగర్ బస్తీ దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, అవుట్‌పేషెంట్ రిజిస్టర్, ఎన్‌సిడీ రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్‌ను పరిశీలించారు. అధిక రక్తపోటు, డయాబెటిస్ బాధితులు ప్రభుత్వ సరఫరా చేసే ఉచిత మందులను వినియోగించేలా ప్రోత్సహించాలని సూచించారు. స్టాఫ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించాలని, గర్భిణీల చెకప్స్, అభా కార్డుల సృష్టి సంఖ్యను పెంచాలని, 13 ఏళ్ల పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ చేసి, రీ-స్క్రీనింగ్ ద్వారా ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే వైద్య సిబ్బంది బాధ్యత అని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సఫీర్, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మేడే వాడవాడల ఘనంగా నిర్వహించాలి

-- సిఐటియు



**తిప్పర్తి, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఎర్రజెండాలు ఎగురవేయాలని సిఐటియు మండల కన్వీనర్ భీమగాని గణేష్ పిలుపునిచ్చారు. మార్కెట్ యార్డులో హమాలి కార్మికులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ, "ఎనిమిది గంటల పని విధానం కోసం అమరవీరులు చేసిన పోరాటం స్ఫూర్తితో మేడేను ఘనంగా జరుపుకోవాలి. నేటి పాలకులు కార్మిక హక్కులను కాలరాస్తున్నారు. రైతులు, కార్మికులు ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలి" అని అన్నారు. మేడే రోజున మార్కెట్ యార్డ్ నుండి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం బహిరంగ సభలో కార్మికులు, కర్షకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి రవి, యాదయ్య, భద్రయ్య, మహేష్, బిక్షం, లక్ష్మయ్య, దినేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మే 10న తెలంగాణకు రానున్న ప్రధాని నరేంద్ర మోదీ




**కరీంనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత ప్రధానమంత్రిగా వరుసగా మూడవసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోదీ తొలిసారిగా ఈ నెల 10వ తేదీన తెలంగాణ రాష్ట్రానికి రానున్నారని బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ వెల్లడించారు. కరీంనగర్‌లోని అదితి హోటల్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోదీ పర్యటన రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మే 1న ప్రారంభంకానున్న విద్యుత్ భద్రతా వారోత్సవాలు



**కరీంనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విద్యుత్ వినియోగంలో అప్రమత్తత పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఎన్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. మే 1 నుండి 7 వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రకటించారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో అధికారులు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావడమే ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. వినియోగదారులు, ముఖ్యంగా రైతులు విద్యుత్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోకూడదని, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

## రైతులకు మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన సదస్సు

**హుస్నాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహమ్మదాపూర్ గ్రామ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తోర్నల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రైతులకు మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. డా. జి. సంతోష్‌కుమార్, డా. జి. నీలిమ మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని, పంట మార్పిడి పాటించడం ద్వారా స్థిర ఆదాయం పొందవచ్చని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని, మార్కెట్లో లాభసాటిగా ఉన్న వరి రకాలను పండించాలని, సేంద్రీయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. రాబోయే వానాకాలం సీజన్‌లో వరి పంటలలో నేరుగా



విత్తనాలు వెదజల్లడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని, యూనివర్సిటీ అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను వేసుకుంటే పురుగు, తెగుళ్లు తగ్గుతాయని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ సందర్భంగా (ఏడీఏ) వీణారెడ్డి రైతులు సమగ్ర వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. హార్టికల్చర్ అధికారి బాలాజీ ఆయిల్ పామ్ సాగు, ప్రభుత్వ సబ్సిడీ వివరాలను తెలియజేశారు. రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పూజా, సెరికల్చర్ ఆఫీసర్ మల్లయ్య, విస్తరణ అధికారులు స్వామి, వెంకటశివరం, సంగీత, గ్రామ సర్పంచ్ జిల్లెల తిరుమల, ఉపసర్పంచ్ కత్తుల సమ్మరాజు, రైతులు పాల్గొన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించి వ్యవసాయంలో ముందంజలో నిలవవచ్చని నిపుణులు సూచించారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో గూగుల్ యాప్‌లపై ఫ్యాకల్టీ శిక్షణ



**కరీంనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కరీంనగర్‌లో ఏప్రిల్ 27 నుండి 30 వరకు గూగుల్ యాప్‌ల సాధనాలపై నాలుగు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఐక్యుఏసీ కోఆర్డినేటర్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. ఎం. కల్పనా రిసోర్స్ పర్సన్‌గా నిర్వహించారు. గూగుల్ క్లాస్‌రూమ్, ఫార్మ్స్, డాక్స్, షీట్స్, స్లైడ్స్, డ్రైవ్, మీట్, క్యాలెండర్, సైట్స్, కీప్, జాంబోర్డ్, స్కాలర్ వంటి డిజిటల్ సాధనాలపై అధ్యాపకులకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని తమ డిజిటల్ బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారు. వినూత్న బోధనా విధానాలను ప్రోత్సహించడం, విద్యా ప్రక్రియలో సాంకేతికతను సమగ్రపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. పాల్గొన్న వారినుంచి వచ్చిన సానుకూల స్పందనలతో ఎఫ్‌డిపి విజయవంతంగా ముగిసింది. అధ్యాపకుల బోధనా సామర్థ్యాన్ని, డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడంలో ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు.

## బొమ్మకల్‌లో ఐకెపి సెంటర్ ప్రారంభం



**కరీంనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలం 6వ డివిజన్ (బొమ్మకల్--గుంటూరుపల్లె)లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక ఆరవ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేశ్, ఐదవ డివిజన్ కార్పొరేటర్ గాదె రూపా--శ్రీనివాస్‌తో కలిసి ఐకెపి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు కాంరెడ్డి రాంరెడ్డి, బీరం ఆంజనేయులు, పుట్టపాక శ్రీధర్, కపిల్ మాధవ, పురుమల్ల శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, హమాలీలు, మహిళలు పాల్గొన్నారు. రైతులకు మద్దతు ధర చెల్లింపుతో నేరుగా మిల్లులకు ధాన్యం తరలించే విధానాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## బైకును ఢీ కొట్టిన మట్టి మాఫియా లారీ

-- బైక్ రైడర్‌కు తీవ్ర గాయాలు



**హుస్నాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సైదాపూర్ మండలం ఎలబోతారం గ్రామ శివారులోని చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్న మట్టి మాఫియా లారీలు ప్రమాదానికి కారణమయ్యాయి. అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న ఖమ్మం రమేష్‌ను లారీ ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన రమేష్‌ను సమీప ఆసుపత్రికి తరలించారు. రమేష్ స్వగ్రామం సైదాపూర్ కాగా, ఆయన స్కూల్ వ్యాన్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా వెలువడాల్సి ఉంది.

## క్లిష్టమైన శస్త్రచికిత్సలకు నిలయంగా ప్రభుత్వ ఆసుపత్రి

**పెద్దపల్లి, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి క్లిష్టమైన శస్త్రచికిత్సలకు నిలయంగా నిలుస్తోంది. పట్టణానికి చెందిన 28 ఏళ్ల మహిళ కాలిన గాయాలతో ఆసుపత్రికి చేరగా, సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ సూచనల మేరకు డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ విష్ణు చంద్రిక ఆధ్వర్యంలో చికిత్స అందించారు. అనంతరం ప్లాస్టిక్ సర్జన్ కేర్ కోసం హయ్యర్ సెంటర్‌కు తరలించారు. గత 15 రోజులుగా పెద్దపల్లి




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగికి ఈ రోజు ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ అశోక్ రెడ్డి స్కిన్ గ్రాఫ్టింగ్ చేసి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు.

పెద్దపల్లిలో ఇలాంటి సర్జరీ జరగడం ఇదే మొదటిసారి. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ అశోక్ రెడ్డి (ప్లాస్టిక్ సర్జన్), డాక్టర్ సాయిప్రసాద్ (జనరల్ సర్జన్), డాక్టర్ స్వాతి (అనేస్థెటిస్ట్) కీలక పాత్ర పోషించారు. వారి కృషిని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ అభినందించారు. అనంతరం వైద్య బృందం డాక్టర్ అశోక్ రెడ్డిని సన్మానించింది. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అందించిన ఈ సేవ స్థానిక ప్రజలకు నమ్మకాన్ని కలిగించింది.

## ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసిన సర్పంచ్



**మర్రిగూడ, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని లెంకలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గ్రామ సర్పంచ్ అయితగోని పద్మ వెంకటయ్య గౌడ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “చదువు మనిషికి జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత ఉత్సాహం కలుగుతుంది” అని పేర్కొన్నారు. ప్రథమ స్థానం సాధించిన ప్రసన్నకు ?8116, ద్వితీయ స్థానం సాధించిన మనీకు 5116, తృతీయ స్థానం సాధించిన శ్రీచందనకు 3116 నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేతరి శంకర్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దండుమైలారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి గ్రామానికి గౌరవం తెచ్చారు. ఈ సంవత్సరం 58 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై, వారిలో 49 మంది ఉత్తీర్ణత సాధించి 84.5% ఫలితాన్ని నమోదు చేశారు. పాఠశాల విద్యార్థులలో ధర్ణమోని విఘ్నేష్, ఎస్కే ముస్కాన్ 544 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆర్. అశ్విని (535) ద్వితీయ స్థానం, చి. రాజేశ్వరి (533) తృతీయ స్థానం, పి. నేత్ర (530) నాలుగో స్థానం సాధించారు. చి. సాయి ప్రణీత్, ఎన్. భావన (509) ఐదవ స్థానంలో, కె. రుచిత (502), ఎస్కే అలీం (501) ఆరు, ఏడు స్థానాల్లో నిలిచారు. మొత్తం 9 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషమని ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ సార్ పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం, గ్రామ పెద్దల ప్రోత్సాహం కారణమని ఆయన అభినందించారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్

**ఎలిగేడు, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “ప్రజా ప్రభుత్వం రైతుల బాగు కోసం కృషి చేస్తోంది. 17 శాతం మ్యాచర్ ప్రకారం ధాన్యాన్ని తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించాలి. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటం మా బాధ్యత” అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, రాష్ట్ర యూత్ నాయకుడు దుగ్యాల సంతోష్ రావు, ఉప సర్పంచ్ బొడుగే శివకృష్ణ గౌడ్, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు పర్యాటక శాఖ డైరీ అందజేత



**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కొత్త కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ను పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పర్యాటక శాఖ డైరీ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని పర్యాటక రంగం, సోమశిల టూరిజం బోటింగ్ వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో బన్సీలాల్, ఎమ్మార్వో మాధవి, సోమశిల సర్పంచ్ కాటం వెంకట లక్ష్మి వెంకటస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్య, జీపీఓ కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ దత్తత నేరం


**- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**



**ఫరూఖ్ నగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫరూఖ్ నగర్ మండల కార్యాలయంలో నిర్వహించిన “దత్తత అవగాహన సదస్సు”లో ఎంపీడీవో బన్సీలాల్ మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు తప్పనిసరిగా చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారానే దత్తత తీసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. అనధికారికంగా ఆసుపత్రుల నుండి లేదా దళారుల ద్వారా పిల్లలను దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరమని ఆయన స్పష్టం చేశారు. అనాథ పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు బాలల సంరక్షణ కేంద్రం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ, సంధ్య దత్తతకు ఉండాల్సిన అర్హతలను వివరించారు. కనీసం రెండు సంవత్సరాల వివాహ బంధం, వయసు పరిమితులు, ఒంటరి మహిళలకు అనుమతి, కానీ ఒంటరి పురుషుడు ఆడపిల్లను దత్తత తీసుకోవడానికి వీలులేదని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ, పిల్లలను అమ్మడం లేదా కొనడం సెక్షన్ 80, 81 ప్రకారం నేరమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడితే మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక లక్ష రూపాయల జరిమానా విధిస్తారని హెచ్చరించారు. గ్రామాల్లో ఇటువంటి ఘటనలు గమనిస్తే వెంటనే 1098 హెల్ప్‌లైన్ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఉదయ, ఏఈఓ జంగయ్య, రజియా సుల్తానా, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, విలేజ్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనకు అధికారిక ఆమోదం

**- కప్పాటి పాండురంగా రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం ఆవిష్కృతమైంది. సామాజిక తెలంగాణ సాధనే ధ్యేయంగా స్థాపించబడిన ‘తెలంగాణ రక్షణ సేన’ (టీఆర్ఎస్) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక ఆమోదం తెలిపింది. ఈ నెల 25న మేడ్చల్‌లో జరిగిన సభలో జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ ఆవిర్భావాన్ని ప్రకటించిన విషయం విదితమే. ఆ ప్రకటనకు నేడు చట్టబద్ధత లభించింది. బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు స్వయంగా విచ్చేసి ఆమోద లేఖను అందజేశారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి మాట్లాడుతూ, “ఇది తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు దక్కిన తొలి విజయం. పార్టీ ‘పాంచజన్యం’ పేరుతో ఐదు ప్రధాన అంశాలను ముందుకు తీసుకెళ్తుంది -- కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం, అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్, నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, యువతకు స్వయం ఉపాధి రుణాలు, అన్ని వర్గాలకు సమన్యాయం” అని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు తెలుపుతూ, “ప్రజల గొంతుకను వినిపించేందుకు, వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు పుట్టిన ఈ పార్టీ తెలంగాణ భవిష్యత్తును పునర్నిర్మిస్తుంది” అని వారు స్పష్టం చేశారు.

# దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది






**దేవరకొండ, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ నియోజకవర్గంలోని కొండల్లేపల్లి మండలం కోల్ ముంతల్ పహాడ్ గ్రామ రైతు వేదిక వద్ద 20 ఎకరాల్లో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులకు రాష్ట్ర ఆర్‌డబి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసన మండలి సభ్యులు గుత్తా సుఖేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్తో కలిసి ఎమ్మెల్యే నెనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “విద్య రేపటి తరం తలరాతను మారుస్తుంది. విద్యతోనే సమాజం ఎదుగుతుంది. మా ప్రభుత్వం విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమని నమ్ముతోంది. దేవరకొండలో నిర్మిస్తున్న ఈ స్కూల్ భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది” అని అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో ప్రతి నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని, విద్యార్థులు, ఉపాధ్యాయులు క్యాంపస్‌లోనే ఉండే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి క్రీడా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, “దేశంలో ఎక్కడా లేని ఈ సమగ్ర స్కూల్ మోడల్ తెలంగాణ ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనం. పనులు వేగంగా సాగేందుకు ప్రతి 15 రోజులకు నిధులు విడుదల చేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలు 40%, కాస్మెటిక్ చార్జీలు 200% పెంచాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలు తెలుసుకునే విధానాన్ని అమలు చేస్తున్నాం” అని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామీణ రహదారి సదుపాయాల అభివృద్ధి, స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తుందని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. దేవరకొండలోని 100 పడకల ఆసుపత్రిని 200 పడకలుగా విస్తరించాలని ఎమ్మెల్యే కోరారు. అదనంగా, కొండమల్లేపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.80 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నల్గొండ మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆర్డీవో రమణా రెడ్డి, డిఇఓ, సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఐదుగురు ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కుషాయిగూడ లో ఘనంగా అన్నదాన కార్యక్రమం....

**కుషాయిగూడ , ఏప్రిల్ 30( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కుషాయిగూడ శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సంధ్బంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాసవి మిత్రమండలి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నేతృత్వంలో దాతల సహకారంతో ఘనంగా భక్తుల కు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్



చైర్పర్సన్ కల్వ సుజాత గుప్త హాజరై ముందుగా వాసవి కన్యకాపరమేశ్వరి మాతా చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఈ



కార్యక్రమం లో ఆర్యవైశ్య సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని సేవ అందించిన వారికి సహకరించిన అన్నదాతలకు వాసవి మిత్రమండలి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్స్‌గా మార్చాలి






## టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యాసదస్సు

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యాసదస్సులో కామన్ స్కూల్ విధానం, శాస్త్రీయ విద్య అమలు, ప్రైవేట్ విద్యా వ్యవస్థ రద్దు ప్రధాన ఎజెండాగా నిలిచింది.సదస్సుకు అధ్యక్షత వహించిన రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ మాట్లాడుతూ, "సమాజంలో కొనసాగుతున్న అసమానతలను నిర్మూలించడంలో విద్య ప్రధాన భూమిక వహించాలి. అందరికీ సమానమైన, నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానాలు రూపొందించాలి" అని



పేర్కొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ, "ప్రజావిద్యా వ్యవస్థను పటిష్టపర్చడం, ప్రభుత్వ బడులను పరిరక్షించడం, కామన్ స్కూల్ విధానం అమలు చేయడం కోసం ప్రజా ఉద్యమ ఒత్తిడి పెరగాలి" అని అన్నారు.ప్రొ. జి. హరగోపాల్ మాట్లాడుతూ, "విద్య ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, కాశాయీకరణ ద్వారా పాలకులు తమ రాజకీయ ఎజెండాను సాధించాలనుకుంటున్నారు. రాజ్యాంగ విలువలను ధ్వంసం చేసే ఈ ప్రయత్నాలను ప్రజాస్వామిక వాదులు, విద్యావేత్తలు ఒక్కటిగా వ్యతిరేకించాలి" అని పిలుపునిచ్చారు.గౌరవ అతిథి ఎం.ఎల్.సి. ప్రొ. కోదండరాం మాట్లాడుతూ, "ఉపాధ్యాయునికి తరగతి గదే సమాజం. ప్రభుత్వ విద్య సంక్షోభంలో ఉంది. దాన్ని కాపాడేందుకు ఉపాధ్యాయ సంఘాలు ముందుకు రావాలి" అని సూచించారు.ఈ సందర్భంగా ప్రొ. కె. లక్ష్మీనారాయణ, నర్సింహారెడ్డి, పి. నాగిరెడ్డి, ఎం. ప్రకాష్ రావు సందేశాలు ఇచ్చారు. రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండు పూటలా ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలి



**నిడమానూరు ఏప్రిల్ 30.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** ఉపాధి హామీ పనీలో హాజరు కొరకు కూలీలకు రెండు పూటలా ఫోటోలు ఇచ్చే విధానాన్ని రద్దుచేసి మాస్టర్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సురేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను సందర్శించి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిపిజి రాంజీ బిల్లును వెంటనే ఉపసంహరించుకొని పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పనులను కొనసాగించాలని వారు కోరారు. రెండు పూటలా ఫోటో విధానం వల్ల ఫోటో మ్యాచ్ కాకుండా కూలీలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వమే 100% నిధులు కేటాయించి, సంవత్సరానికి 200రోజుల పని కల్పించి కనీస వేతనం 800 రూపాయలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత తరుణంలో వ్యవసాయంలో పెరిగిపోయి కూలీలకు పని దొరకడం లేదని జీవనోపాధికి ఉపాధి హామీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. వ్యవసాయ కార్మికులకు భూమిలేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 12 వేల రూపాయల హామీని అమలు చేయాలని, గ్రామాలలో పేదలకు గతంలో ప్రభుత్వం కేటాయించిన ఇళ్లస్థలాలను వెంటనే పంపిణీ చేయాలని ఆయన ఈ సందర్భంగా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కొండేటి సైదయ్య, తోట సీనయ్య, గోపయ్య, ఆవుల రామకృష్ణ, గురువయ్య, రాంబాబు, చంద్రకళ, అచ్చమ్మ, సరిత, లక్ష్మమ్మ, మంగమ్మ, బంగారి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కార్మికుల దినోత్సవము మేడే


పనిచేసే ప్రతి మనిషిఎవరైనా సరే మే డే జరుపుకోవచ్చు. ఇది కేవలం ఒక్క వర్గానికి కాదు ,సమాజంలో శ్రమించే అందరికీ పండగ రోజు లిమేలి డేలిలి

1886లో చికాగోలో కార్మికులు 8గంటలపని సమయం కోసం, భారీ సమ్మెలు చేశారు ,మే 4,1886న జరిగిన హై మార్కెట్ ఎఫైర్ లో హింస చోటుచేసుకుని కొందరు మరణించారు. ఈ సంఘటన కార్మిక హక్కుల పోరాటానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది.

1889లో సెకండ్ ఇంటర్నేషనల్ మే 01 అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం గా ప్రకటించింది.

నేటి అంతర్జాతీయ కార్మిక దినోత్సవం ,మనకు ఒక కీలక ప్రశ్నను గుర్తుచేస్తుంది. ఈరోజుల్లో మంచి జీవనోపాధి మార్గాలు ఎక్కడ?

పారిశ్రామిక యుగములో, కేవలం ఫ్యాక్టరీలు ప్రధాన ఉపాధి వనరులు ,కానీ నేడు 21వ శతాబ్దముకొమెరుగైన అవకాశాలు విస్తరించాయి. ముఖ్యంగా ప్రభుత్వం ప్రవేట్ రంగాలలో (శ్రమే సంపద కు మూలం). ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రయోజనాలు: స్థిరమైన జీతం ఉద్యోగ భద్రత, పెన్షన్, ఇతర సదుపాయాలు ,సామాజిక గౌరవం. పోటీ చాలా ఎక్కువగా ఉంటుంది .ప్రమోషన్స్ నెమ్మదిగా ఉంటాయి. ఆదాయం పరిమితంగా ఉంటుంది. స్థిరత్వం కోరుకునే వారికి ,రిస్క్ తీసుకోలేని ,వారికి సరిపోతుంది.




ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగాలు ,ప్రయోజనాలు:స్కిల్స్ ఉంటే అధిక జీతం వేగంగా ప్రమోషన్స్, కొత్త టెక్నాలజీ అనుభవం ,ఉద్యోగ భద్రత తక్కువ పని ఒత్తిడి అధిక సమయం. స్కిల్స్ ఉన్నయువత వేగంగా అభివృద్ధి కోరుకునే వారికి సరిపోతుంది.

ప్రయోజనాలు ఆదాయం అపరిమిత ఆదాయం,సమయం స్వేచ్ఛ, ఇతరులకు ఉద్యోగాలుఇవ్వడం, రిస్కు ఎక్కువ, మొదట్లో ఆదాయం స్థిరంగా ఉండదు. ఓపిక, పట్టుదల ,అవసరం రిస్కు తీసుకునే ధైర్యంఉన్న,కొత్త ఆలోచన ఉన్నవారికి సరిపోతుంది.

**నేటి కొత్త అవకాశాలు:** ఈ కామర్స్ ద్వారా ఇంటి నుంచి వ్యాపారం చిన్న పెట్టుబడితో పెద్ద మార్కెట్. ట డైరెక్ట్ సెల్లింగ్ పార్ట్ టైమ్ ఆదాయం ,వ్యక్తిగత అభివృద్ధి, వ్యక్తిత్వ అభివృద్ధి. సరియైన ఎంపిక ఎలా ఉండాలంటే ఏ ఒక్కటిబెస్ట్ కాదు ,మీ లక్ష్యంపై ఆధారపడి ఉంటుంది. భద్రత కావాలి-ప్రభుత్వ ఉద్యోగం వేగంగా ఎదగాలి-ప్రైవేటు ఉద్యోగం, స్వతంత్రంగా ఎదగాలి-వ్యాపారం

నేటి మార్గం జాబ్ంఅదనపు వర్క్ అదనపు ఆదాయం.

**యువతకు సందేశం:** కేవలం డిగ్రీ కాదు, స్కిల్స్ ముఖ్యం, డిజిటల్ నాలెడ్జి అవసరం, మార్పులకు సిద్ధంగా ఉండాలి.

శ్రమంస్మార్ట్ వర్క్ కలిపితేనే విజయం.

**ముగింపు:** కార్మికుడు శ్రమ ప్రపంచాన్ని నడిపిస్తుంది సరైన దిశలో శ్రమిస్తేనే విజయం వరిస్తుంది.

పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప నాటి సూక్తి.

**నేటి సూక్తి:** అందరూ ఆరోగ్యంగా ఉండాలి ఆర్థికంగా ఎదగాలి అందులో మనం ఉండాలి అందరి ఆర్థిక ఆరోగ్య ఎదుగుదల సంతోషాల పునాదులకు మనమే బాధ్యత వహించాలి.

కామేపల్లి లక్ష్మయ్య.(టీచర్)
సామాజిక వైద్యులు.దేవరకొండ.
9542311846.



# ప్రపంచ కార్మికులారా ఏకంకండి

-- మేడే జయప్రదం చేయండి




**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక వర్గం ఐక్యమై మేడే విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మీనాచారి భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "చికాగో అమరవీరుల త్యాగాలతో సాధించిన ఎనిమిది గంటల పని దినం, కార్మిక హక్కులు నేడు ప్రమాదంలో ఉన్నాయి. లేబర్ కోడులు, ఉపాధి హామీ పథకంపై కుట్రలు కార్మికులను ఇబ్బంది పెడుతున్నాయి. కనీస సౌకర్యాలు, తగిన కూలి, సకాలంలో చెల్లింపులు అందించాలి" అని డిమాండ్ చేశారు.రైతాంగం పోరాటాలతో నల్ల చట్టాలను వెనక్కి నెట్టిన చరిత్రను గుర్తుచేస్తూ, "కార్మికులు, రైతులు, కూలీలు అందరూ ఐక్యమై మేడే విజయవంతం చేసి చికాగో అమరవీరులకు జోహార్లు అర్పించాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

# ఆలయంలో వైభవంగా నృసింహ జయంతి



**ఎలిగేడు, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముప్పిరితోట గ్రామంలోని శ్రీ మదలమేల్మంగా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నృసింహ జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించారు.ఉదయం, సాయంత్రం హవనం, బలిహరణం, హనుమత్సేవ వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# నూతన డిఎం అండ్ హెచ్ ఓ స్వర్ణకుమారికి సత్కారం



**రంగారెడ్డి, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా నూతన డిఎం అండ్ హెచ్ ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ స్వర్ణకుమారిను కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి, పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆమెను కోరారు. కార్యక్రమంలో ఏఓ షఫీ, జిల్లా డెమో అధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయ స్వామి వార్షికోత్సవంలో పాల్గొన్న కౌన్సిలర్ పాపిశెట్టి రాము




**ఆమనగల్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పట్టణంలోని బీసీ కాలనీలో గురువారం జరిగిన శ్రీ అభయాంజనేయ స్వామి 11వ వార్షికోత్సవ వేడుకల్లో కౌన్సిలర్ పాపిశెట్టి రాము పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆధ్యాత్మిక చింతన, భక్తి భావం అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ప్రజలు ధర్మకార్యాలలో పాల్గొనడం ద్వారా దైనందిన జీవిత ఒత్తిడిని అధిగమించవచ్చు" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎంగలి బాలకృష్ణ, మస్న అప్పి, శీనుతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు. ఆమనగల్లుకు కొత్త కమిషనర్ గా రాఘవేందర్ రెడ్డి

# అంగన్వాడీ టీచర్ సేవలు మరువలేనివి



ఉద్యోగ విరమణ పొందిన శోభను సన్మానించి అభినందిస్తున్న సిడిపిఓ కవిత సూపర్వైజర్ సూర్య కళ



శోభాను సన్మానిస్తున్న అంగన్వాడి టీచర్లు

**-- సిడిపిఓ కవిత**

**ఎలిగేడు, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాపూర్ గ్రామంలో 35 సంవత్సరాలుగా అంగన్వాడీ టీచర్‌గా సేవలందించిన శోభ మాధవరావును సిడిపిఓ కవిత ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ, "పిల్లలు, బాలింతలు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందిస్తూ విధుల పట్ల నిబద్ధతతో పనిచేసిన శోభ సేవలు మరువలేనివి. ప్రతి ఉద్యోగికి విరమణ సహజం, కానీ ఆమె సేవలు ఆదర్శప్రాయమైనవి" అని అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన శోభ మాట్లాడుతూ, "సొంత ఊరిలో సేవలు అందించడం ఎంతో సంతృప్తి కలిగించింది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సూర్యకళ, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

# గ్రామీణ యువతకు ఆశాకిరణంగా సుంకిరెడ్డి






**ఆమనగల్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణ యువత ప్రతిభకు తగిన అవకాశాల వేదికలను అందించాలనే సంకల్పంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదవ ఉచిత ఎస్ఐ & కానిస్టేబుల్ శిక్షణ కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆమనగల్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామాల్లో ప్రతిభ ఉంది కానీ అవకాశాలు మాత్రం నగరాలకే పరిమితమైపోయాయి. కోచింగ్ ఫీజులు కట్టలేక ఎన్నో కలలు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. ప్రతి మండల కేంద్రంలో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, పాఠ్యాంశాలతో పాటు శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, మానసిక ధైర్యం పెంపొందించేలా పూర్తి స్థాయి అభ్యర్థులుగా తీర్చిదిద్దుతున్నాం" అని తెలిపారు. అతిథులు మాట్లాడుతూ, "ఇది సాధారణ శిక్షణ కేంద్రం కాదు, గ్రామీణ యువత జీవితాలను మలిచే మహత్తర కార్యక్రమం. పేద విద్యార్థులకు ఇది ఆశాకిరణం" అని కొనియాడారు. శిక్షణ కేంద్రంలో చేరిన విద్యార్థులు మాట్లాడుతూ, "మా పరిస్థితుల్లో కోచింగ్ ఖర్చుతో కూడుకున్నది. ఇప్పుడు అదే శిక్షణ ఉచితంగా అందుబాటులో రావడం గొప్ప అవకాశం. ఉద్యోగం సాధించి కుటుంబాల ఆశలను నెరవేర్చుతాం" అని ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఏఎస్సై రాంరెడ్డి, సర్పంచ్ కళ్యాణ్, మాజీ ఎంపీటీసీ పంతు నాయక్, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, ఉపాధ్యాయులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అమెరికా యుద్ధ నౌక వెనక్కి

**-300 రోజులుగా మోహరింపు**

**-ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధనౌకగా రికార్డు**



**వాషింగ్టన్ : ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచంలోనే అతి పెద్ద యుద్ధ నౌక అయిన యుఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ 300 రోజుల అనంతరం అమెరికాకు తిరిగి చేరుకోనుంది. రికార్డు స్థాయి మోహరింపు తర్వాత యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ పశ్చిమాసియా నుంచి వెనక్కి రానున్నది. ఈ యుద్ధ నౌకను వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను పట్టుకోవటానికి అమెరికా సైన్యం వినియోగించింది. అనంతరం ఇరాన్‌పై సంబంధించిన యుద్ధ కార్యకలాపాలకు ఉపయోగించింది. అయితే ఆ యుద్ధనౌకపై క్షిపణులతో విరుచుకుపడటంతో దెబ్బతిన్న విషయం విదితమే. అమెరికా సైన్యం ఆత్మస్థైర్యాన్ని ఇరాన్ దెబ్బ కొట్టడంతో ట్రంప్ బృందం తట్టుకోలేకపోతోంది. మరోవైపు గెరాల్డ్ యుద్ధనౌకలో ఉన్న సిబ్బందికి కలిగిన అవస్థలు, వారిపై పెరుగుతున్న ఒత్తిడి కారణంగా తిరిగి అమెరికాకు చేరుకోనున్నది. 300 రోజులకు పైగా సాగిన రికార్డు స్థాయి మోహరింపు తర్వాత స్వదేశానికి బయలుదేరనుందని ఇద్దరు అమెరికా అధికారులు తెలిపారు. గత వారం యూఎస్ఎస్ జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ ఈ ప్రాంతానికి రాకతో, ఇరాన్ యుద్ధంలో బలహీనమైన కాల్పుల విరమణ సమయంలో పశ్చిమాసియాలో మూడు అమెరికన్ విమాన వాహక నౌకలు మోహరించాయి . 2003 తర్వాత ఇంత సంఖ్యలో మోహరించడం ఇదే మొదటిసారి. టెహ్రాన్‌తో ఉద్రిక్తతలు పెరగడంతో యూఎస్ఎస్ అబ్రహం లింకన్ కూడా జనవరి నుంచి ఈ ప్రాంతంలోనే ఉంది. అయితే ఈ యుద్ధనౌకపై కూడా ఇరాన్ క్షిపణి దాడులతో అమెరికా సైన్యానికి దడపుట్టించింది.

# అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం



**న్యూఢిల్లీ ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పహల్గామ్ ఉగ్రదాడి కి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని, ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.02.0) లో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సామర్థ్యం లేక ఆపరేషన్ సింధూర్ ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ అని, ఇందులో మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకు వెళ్లాయని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్‌ను ప్రారంభించి సరైన సమయంలోనే దాన్ని ముగించామని, అది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయమని అన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని చెప్పారు. దీనిపై పోరాటం కేవలం భద్రతకు సంబంధించిన విషయమే కాదని, మానవత్వపు మౌలిక విలువలను పరిరక్షించేందుకని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని, దానికి బహుముఖ కోణాలు ఉన్నాయని అన్నారు. దాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాక్ నిరంతరం ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే.. పాకిస్థాన్ ఇంటర్నేషనల్ టెర్రరిజానికి

# ఆన్‌లైన్‌లో నిషేధిత పురుగుమందుల విక్రయాలు చేయరాదు

**- రైతు కమిషన్ ఆదేశాలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీఆర్కేఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అధ్యక్షతన వ్యవసాయ శాఖ అధికారులు, అమెజాన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఎరువులు, పురుగుమందుల విక్రయాలపై చర్చిస్తూ, చైర్మన్ మాట్లాడుతూ, "మానవ ఆరోగ్యానికి హానికరమైన, అధిక విషపూరిత పురుగుమందులు, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. అమెజాన్ ప్రతినిధులు స్పందిస్తూ, "కమిషన్ సూచనలను పూర్తిగా పాటిస్తాం. నిషేధిత పురుగుమందులను వెంటనే ప్లాట్‌ఫామ్ నుండి తొలగిస్తాం. రైతుల క్షేమమే మా ప్రాధాన్యత" అని తెలిపారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కె.వి.ఎన్. రెడ్డి, భూమి సునీల్, మరికంటి భవాని, వ్యవసాయ శాఖ అధికారులు జేడీఏ బాలు, ఏఓ శైలజ, కమిషన్ అధికారులు డా. కేశవులు, సంధ్యారాణి, స్రవంతి, ఏఈఓలు రజిత, శ్రావణి, శ్రావ్య పాల్గొన్నారు.

# కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు

**-- ఎమ్మెల్యే విజయరమణ రావు**



**ఎలిగేడు, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని బుర్హాన్ మియాపేట, సుల్తాన్‌పూర్, ముప్పిరితోట, రాములపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పెద్దపల్లి నియోజకవర్గంలో రైతుల వద్ద నుండి ధాన్యం గింజ కటింగ్ లేకుండా కొనుగోలు జరుగుతోంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు గోపు రజిత లక్ష్మారెడ్డి, కవ్వంపల్లి బాపయ్య, రామిడి శైలజ వెంకట్రామిరెడ్డి, సిద్ది తిరుపతి, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# కుల వివక్షత పాటిస్తే చర్యలు తప్పవు

**-- తహసీల్దార్ యాకన్న**



ముప్పిరితోటలో పౌర హక్కుల దినోత్సవం లో పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు

**ఎలిగేడు, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని ముప్పిరితోలో గురువారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో తహసీల్దార్ యాకన్న మాట్లాడుతూ, "గ్రామాల్లో కుల, మత తారతమ్యాలు లేకుండా ప్రజలు సామరస్య వాతావరణంలో జీవించాలి. కుల వివక్షత పాటిస్తే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామిడి శైలజ--వెంకట్రాంరెడ్డి, ఉపసర్పంచ్ మారం రాయమల్లు, ఎంపీడీవో భాస్కరరావు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి అంజయ్య, ఏఎస్సై శ్రీనివాస్, ఆర్ఐ జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శిరీష, వార్డు సభ్యులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

# ఆమనగల్లుకు కొత్త కమిషనర్ గా రాఘవేందర్ రెడ్డి

**ఆమనగల్లు, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆమనగల్లు మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా ఎస్. రాఘవేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో ఎంపికైన ఆయనకు తొలి పోస్టింగ్‌గా ఆమనగల్లు మున్సిపాలిటీ కేటాయించారు. కాగా ఇక్కడ పని చేసిన శంకర్ నాయక్ కు పోస్టింగ్ కేటాయించాల్సి ఉంది.